
# రెండో మనసు

వై రాజేష్



"మనుషుల్లో కూడా ఇంత కఠిన మనస్కులుంటారా?" అనిపించింది నాకు ఆ క్షణాన.

"వీల్లేదు, కుదరదని చెప్పంటే వినిపించుకోవేం?" కర్కశంగా అరిచింది మేనేజర్ కంఠం.

"సార్! ఎలాగైనా మీరే నా కూతురి ప్రాణాలను కాపాడాలి" మరోసారి దీనంగా అర్థించాడా నడివయస్కుడు.

కరగలేదు ఆ పాషాణం. "ఇదిగో గోపాలయ్యా, ఇతన్ని బయటికి పంపిస్తావా?" అంటూ హుకుం జారీ చేసాడు.

"అంతవరకూ ఎందుకులెండి సార్. ఈ కష్టకాలంలో దానికా పరిస్థితి రావటం మా దౌర్భాగ్యం" గద్గద స్వరంతో గొణుక్కొంటూ వెళ్ళిపోయాడాయన.

"అవసరం ఉన్నప్పుడు సాయం చేయని ఈ బ్యాంకులెందుకు మరి! ఆ మాత్రం సాయపడలేనపుడు మేనేజర్‌గా బాధ్యత స్వీకరించటం కూడా అనవసరం ఈయన" మనస్సులో మరోసారి తిట్టుకున్నాను. అంత కన్నా ఏం చేయగలను? ఆయన్ని మందలించే అధికారం నాలాంటి గుమాస్తాకి ఎలా వస్తుంది?!

* * *

ఆదివారం. ఈ రోజు ఖాళీగా, ఉల్లాసంగా గడపటం ఎంతో ఇష్టం నాకు.

స్టీరియో లోంచి మంద్రంగా వస్తోన్న మహదేవన్ కూర్చిన కమనీయమైన సినిమా పాటలను వింటూండగా మధ్యలో "ఏమండీ" అన్న శ్రీమతి పిలుపు వినరావటంతో తన్మయత్వంతో మూసుకొని ఉన్న నా కళ్ళను అయిష్టంగా తెరిచాను.

"మా తమ్ముడు ఈ రోజు వెళ్ళిపోతున్నాడు తెలుసు కదా! ఈ రోజుకి ఉండమన్నా వినటం లేదు. రేపు కాలేజీకి వెళ్ళిపోవాలట. కాస్త స్టేషన్‌కి వెళ్ళి బండి ఎక్కించి రారూ?"

ఊరికి, రైల్వే స్టేషన్‌కి చాలా దూరం. 'అయితేనేం, ఆటోలున్నాయిగా!' మనస్సులోనే విసుక్కుంటూ పడక్కుర్చీలోంచి లేచాను.

స్టేషన్నించి తిరిగి వస్తూ కూరగాయలు కూడా తెమ్మని మా ఆవిడ చెప్పటంతో మార్కెట్ వైపు స్కూటర్ని తిప్పాను.

రాత్రి పడిన వర్షానికి మార్కెట్లోని చెత్తంతా నాని నాని అడుగు పెట్టటానికే చికాకుగా ఉంది. అయినా తప్పదుగా.

వంకాయలు కొంటూ 'హలో' అన్న పిలుపుతో ఉలిక్కిపడి ఆ వైపు తిరిగాను. మా మేనేజర్ నవ్వుతూ చూస్తున్నాడు. విష్ చేసాను, బదులుగా నవ్వుతూ, "ఇక్కడికి దగ్గరే మా యిల్లు, రండి వెళ్దాం" పిలిచాడాయన. ఇష్టం లేకపోయినా మర్యాద కోసం ఆయననుసరించక తప్పలేదు నాకు.

"ఇక్కడే, ఆపండి." మేనేజర్ మాట విని స్కూటర్ని ఆపాను. మరీ పెద్ద ఇల్లు కాదు. డాబా యిల్లు. అయినా అందంగా ఉంది.

స్కూటర్ని పార్క్ చేసి ఆయన కూడా లోపలికి వెళ్ళాను.

సోఫాలో నన్ను కూర్చోమంటూ ఆయన కూడా ఎదురుగా ఉన్న సోఫాలో కూర్చొని పిలిచారు "పద్మా! మంచినీళ్ళు తీసుకుని రా"

పద్మంటే ఆయన భార్య కావచ్చు అనుకున్న నేను ఆశ్చర్యపోయాను. ఎందుకంటే ఆ పద్మ చిరుగజ్జెలను శ్రావ్యంగా మోగించుకుంటూ పట్టుపరికిణీలో చూడముచ్చటగా ఉన్న పన్నెండేళ్ళ చిన్నారి పాప.

మంచి నీళ్ళందుకొంటూ "మీ పాపా?!" అడిగాను.

"ఆ మధ్య ఓ ముసలాయన తన కూతురికి బావుండలేదని, లోనేదైనా ఇమ్మని అడిగితే కుదరదని పంపేసాను గుర్తుందా?!"

'ఎందుకు జ్ఞాపకముండదూ!' నిష్టూరాన్ని ముఖం పైన కనబడనివ్వకుండా జాగ్రత్తపడుతూ చెప్పాను, "ఉంది"..

"ఆ ప్రాణాపాయంలో ఉన్న పాపే ఈ పద్మ".

నా ఆశ్చర్యానికి సమాధానంగా ఆయన చెప్పటం కొనసాగించారు- "కొన్ని కొన్ని పనులు మనం ఉద్యోగరీత్యా చేయలేం మిస్టర్ ప్రశాంత్! ఆ రోజు పద్మ తండ్రి దీనంగా అర్థిస్తుంటే నాకే ఎంతో బాధ వేసింది. కానీ మేనేజర్‌గా నేను అసహాయుడిని. పుట్టుకతోనే బలహీనమైన గుండెతో పుట్టిన ఈ పాపను ఓపెన్ హార్ట్ సర్జరీ చేసేంత ఆర్థిక సహాయం మన బ్యాంక్

వల్ల కానిపని. అందుకనే ఆ రోజు వాళ్ళ యింటికి వెళ్ళాను. దుర్భర దారిద్ర్యంలో ఐదుగురు, ఆడపిల్లల తర్వాత, అదీ పుట్టుకతోనే ఈ ఖరీదైన జబ్బుతో పుట్టటం పద్మ దురదృష్టం. వాళ్ళ పరిస్థితి నాకు అర్థం అయింది. ఆ పాప ఇక్కడకు వచ్చి పదిరోజులు దాటుతోంది."

"మరి మీ భార్యా పిల్లలు...." అర్థోక్తిగా ఆగిపోయాను. అకస్మాత్తుగా ఆయన ముఖంలో "విషాదం అలుముకొంది--" "నేను ఇంతకు ముందు పని చేసింది మహారాష్ట్రలోని లాతూర్ దగ్గరి ఓ రూరల్ బ్రాంచి. నేను మీటింగ్ కని ఒక్కణ్ణే బొంబాయి వచ్చాను. ఆ రాత్రే వచ్చిన భూకంపంలో...." ఆయన కంఠం రుద్ధమయిందు.

మంచినీళ్ళ గ్లాసు తీసుకోవటాని కని పద్మ వచ్చింది. దగ్గరకు తీసుకొని అక్కున చేర్చుకొంటూ "మా పెద్దమ్మాయిది కూడా దీని వయుసే" ఆప్యాయంగా తల మీద చేయివేసి చెప్పారాయన.

నా మనసు వికలమయ్యింది. నోట మాట రాక అలాగే కూర్చుండిపోయాను.

"సారీ! నా కథంతా చెప్పి మిమ్మల్ని బాధ పెట్టాను. ఉండండి కాఫీ చేస్తాను" అంటూ లేవబోయారాయన.

"వద్దు సార్! ముందీ విషయం. చెప్పండి, పద్మ ఆరోగ్యం విషయం ఏమయ్యింది?" ఆత్రుతతో ప్రశ్నించాను.

"సక్సెస్‌ఫుల్‌గా ఆపరేషన్ అయి నాలుగు రోజులు దాటింది", చిరునవ్వుతో చెప్పారాయన.

నా మనసు పశ్చాత్తాపంతో కృంగిపోయింది. "సారీ సార్! ఆ రోజు లోన్ ఇవ్వనని పద్మ తండ్రిని పంపినప్పటినుండి మిమ్మల్ని ఎంతో తిట్టుకున్నాను. అయితే పద్మ గురించి కాని, ఆమె ఆరోగ్యం సంగతి కానీ ఆ తర్వాత ఏమీ పట్టించుకోలేదు నేను!"

"పర్వాలేదులెండి. ఎవరైనా అలా అనుకోవటం సహజమే." తేలికగా అనేసారు మేనేజర్.

"మరి పద్మ ఇక్కడ ఉంటోందా?!"

"ఆపరేషన్‌కయితే సాయం చేసాను కానీ, నా స్వార్థం కోసం పద్మ తల్లిదండ్రుల పేదరికాన్ని, అసహాయతను క్యాష్ చేసుకోదల్చుకోలేదు నేను. పద్మ ఎక్కడున్నా నాకిష్టమే. అయితే ప్రస్తుతం మాత్రం వాళ్ళింటిని, మా యింటినీ షటిల్ సర్వీస్ చేస్తూంటుంది. తనెక్కడ వుండేదీ భవిష్యత్తే నిర్ణయిస్తుంది."

"మనుషుల్లో కూడా ఇంత కరుణా హృదయులుంటారా?!" అనుకోకుండా ఉండలేకపోయానా క్షణంలో! ◆◆

# ఎండిపోయిన చెరువు

డా. దిలావర్

ఎండిపోయిన మా వూరి చెరువును చూస్తుంటే
నా కడుపు చెరువవుతున్నది.........
యౌవ్వనంతో తొణికిసలాడినప్పుడు
దాని పోకిళ్ళు చూడ్డానికి రెండు కండ్లు చాలవు
మిస మిసలాడే పచ్చని పొలాలలో
అలలు అలలుగా షికారు కొట్టి వచ్చేది.
అప్పుడు దాని ఆకర్షణలో గిరికీలు కొట్టడమే మా నిత్యకృత్యం.
నల్లని నిదుర నీళ్ళలో తుళ్ళిపడే కలల చేపలు.
తన గుండెల మీద ఆడుకునే
కొరమీనుల్లాంటి గోచిపాత చందమామలు.....
గుసగుసలు పోయే నీలాటి రేవు అందాలను
లేత కెరటాలతో తాకి పులకించిపోయే కొంటెతనం.......
కాడెడ్లను కడిగే రైతులు,
బర్రెల తోకలు పట్టుకొని ఈతలు కొట్టే కుర్రకారు,
కోడెకారును ఉసిగొలిపే చాకి రేవు.......
క్రేళ్ళురుకులు..... కేరింతలు......
అలల మడతల్లో ఎన్నెన్ని జ్ఞాపకాలు!
కలువపూల కాటుక కళ్ళతో ఏవేవో సైగలు చేసేది చెరువు.
ఉవ్వెత్తున ఎగిసిపడే గుండెలతో కవ్వించేది చెరువు.
అలలు పోటెత్తి అలుగుపడ్డప్పుడు
ఊరు ఊరంతా గట్లు తెంచుకొని ప్రవహించేది.
చెరువు కట్ట గండిపడి ఏడుస్తుంటే
జనం ఆనకట్టై నిలిచేది.
ఇప్పుడు మా ఊరికే గండిపడ్డట్టుంది
చెమ్మలేని గుండెతో చెరువు తల్లడిల్లుతోంది.
ఇప్పుడు మా ఊరికే అలుగుపడ్డట్టుంది
పట్నం తీక్షణకు చెరువుగుండె నెర్రెలు వారింది.
చెరువు కట్టమీద తత్త్వాలు పాడే బైరాగి గొంతు ఎండిపోయింది.
కలలు కనే కాటుక కండ్లు మసకబారాయి
తుళ్ళిపడే చెరువు కలలు ఇంకిపోయాయి.
శిథిలమైన అలల పుటల్లో
మా జ్ఞాపకాలు బీటలువారాయి
ఎండిపోయిన తల్లివక్షంమీదపడి పాల కోసం తల్లడిల్లే పసిపాపల్లా
చెరువు లోతట్టు గుండెల్లో
ముడుచుకొని పడుకున్నాయి మూగ జీవాలు
అమ్మలాంటి చెరువు దాహార్తితో తపించిపోతుంటే
నెర్రెల్లో నిలువెల్లా కన్నీరై వర్షిస్తున్నాను నేను! ○



